క్లుప్తంగా

రెవరెండ్ ఏసురత్నంకు సత్కారం



సన్మాన సభలో మాట్లాడుతున్న ఏసు రత్నం

కర్నూలు (టౌన్) : ఆధ్యాత్మికతలో , సమాజపరంగా సీఎస్ఐ చర్చి-1 పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జెడ్. ఏసురత్నం గర్వించదగ్గ గురువు అని నంద్యాల డయాసిస్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎస్.పి.జి. కాంపౌండ్‌లో ఏసురత్నం పదవి విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఏసురత్నం పనిచేసిన పదవి కాలంలో ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, సౌత్ కొరియా, థాయిలాండ్, బెల్జియం, శ్రీలంక వంటి అనేక దేశాల్లో దేవుని పరిచర్య చేసి కీర్తి పొందారన్నారు. అనంతరం పాస్టర్‌గా 10 సంవత్సరాలు డీనరీ చైర్మన్‌గా 33 సంవత్సరాలు డయాసిస్ కార్యదర్శిగా, రాయలసీమ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వై.జయరాజు, జాన్‌చంద్ర, ఇమ్మానియేలు, సులోచన పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రైనేజీ పనులు

కల్లూరు : కల్లూరు అర్బన్ పరిధి 21వ వార్డులో ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి నగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎఫ్‌సీఐ-2 కాలనీ, లేపాక్షి నగర్‌లలో రూ. 70లక్షలతో, పార్థసారథి నగర్‌లో రూ. 50లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపట్టారు. ఆయా కాలనీలు ఏర్పడి ఎన్నో ఏళ్లు అయినా గత ప్రభుత్వాలు, మున్సిపాలిటీ పట్టించుకోలేదు . వైఎస్సార్‌సీపీ నగర పాలక వర్గం ఏర్పడ్డాక తమ కాలనీలో సమస్యలు పరిష్కారమవుతున్నాయని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీసీఈబీ సెక్రటరీ పోస్టును భర్తీ చేయాలి

కర్నూలు సిటీ: జిల్లా సాధారణ పరీక్షల విభాగం కార్యదర్శి పోస్టును భర్తీ చేయాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2023-24 స్కూల్ గ్రాంట్ ఇవ్వలేదని, దీని వల్ల స్కూళ్ల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారుతుందన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నారాయణ, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు (హాస్పిటల్): పేద, మధ్య తరగతి కుటుంబాలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.సయ్యద్ పాషా, అమతుల్ ఖాలిక్ కోరారు. ఆదివారం స్థానిక 49వ వార్డులోని రోజా వీధిలో సేఫ్ మదర్ చైల్డ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు బలవర్ధక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఖదీర్ పాషా, సయ్యద్ షఫీ పాషా, సయ్యద్ ఖలీముల్లా, ఎం.సుమలత పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల కరెంట్ బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పిందని, కానీ ఇంత వరకు బిల్లులు చెల్లించలేదన్నారు. స్కూళ్ల నిర్వహణ నిధులను ఇంతవరకు మంజూరు చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు భారంగా మారుతుందన్నారు. ప్రాథమిక విద్యను నాశనం చేసే జీఓ నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబరు 30వ తేదీలోపు జెడ్పీ పీఎఫ్, ఏపీ జీఎల్ఐ రుణాలు, ఫైనల్ పేమెంట్లు, గత ఏడాదిన్నరలో పెండింగ్‌లో ఉన్న సరెండర్ సెలవుల బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, షఫీ, సుధాకర్ గౌడ్, జగదీష్, శ్రీధర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



డిపో గ్యారేజీ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): నెల్లూరు జిల్లా కావలి దగ్గర ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా రవాణా శాఖ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కర్నూలు-1, 2 డిపో గ్యారేజీల వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే డ్రైవర్లపై దాడులు తగవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్, మోహన్‌రావు, మద్దిలేటి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

- ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత
- వైఎస్ఆర్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): గతంలో ఎప్పుడూ లేని విధంగా వైఎస్ఆర్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక 44వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సీతారామ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి, ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అన్ని అర్హతలు ఉన్నా పథకాలు అందేవి కాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు.నేడు రాష్ట్రంలో ఎక్కడా ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఊరూరా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నారన్నారు. కుల మతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారన్నారు. ఏ సమస్య ఉన్నా మీ పరిధిలోని వలంటీరును సంప్రదిస్తే చాలన్నారు. పథకాలకు దరఖాస్తు చేయిస్తారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జనరంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వర రెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, నాయకులు మెహ్రి, జ్ఞానందం, భాను, స్వాతి, ఖాజా, రాము యాదవ్, జంగిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- విశ్రాంత ఉద్యోగులు తరచూ బీపీ, షుగర్ చెక్ చేయించుకోవాలి
- విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ధనరాజ్
- విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కర్నూలు సర్వజన వైద్యశాల విశ్రాంత ప్రొఫెసర్ (మెడిసిన్) డాక్టర్.టి.ధనరాజ్ తెలిపారు. బీపీ, షుగర్ అప్పుడప్పుడు చెక్ చేయించుకుంటూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం కర్నూలు అబ్బాస్ నగర్‌లోని ఎస్‌సీబీ పార్క్‌లో విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్.టి.ధనరాజ్ పెన్షనర్లకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ,షుగర్ పరీక్షలు కూడా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కర్నూలు శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. 80 మంది రిటైర్డ్ ఉద్యోగులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు.అనంతరం డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చాల మంది ఆరోగ్యాలను పట్టించుకోరని, ఇటువంటి వారి కోసం అసోసియేషన్ ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. బీపీ, షుగర్ అదుపులో ఉంటే ఆరోగ్యం బాగా ఉన్నట్లేనని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయాలని, దీని వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కర్నూలు శాఖ నేతలు, విశ్రాంత డీఎఫ్‌ఓ జయచంద్రారెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కాంగ్రెస్ నూతన కార్యవర్గం

కర్నూలు(సెంట్రల్): త్వరలోనే జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తానని జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు ఎంపీ స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రణాళికలు రచిస్తామని వెల్లడించారు.

ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్) : ఇంజినీరింగ్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి డి.సోమన్న డిమాండ్ చేశారు. ఆదివారం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇంజినీరింగ్‌లో పెండింగ్ సీట్లను భర్తీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. దాదాపు విద్యా సంవత్సరం పూర్తి కావొస్తున్నా భర్తీకి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకు ప్రథమ, ద్వితీయ కౌన్సెలింగ్‌లలో 65 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని, మిగిలిన 35 శాతం సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాజశేఖర్,రాజకుమార్‌పాల్గొన్నారు.

రేపు ఆదోనిలో ప్రజా రక్షణ భేరీయాత్ర

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆదోనిలో ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్రను సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. ఆదివారం ఆయన కర్నూలు నగరంలో పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బస్సు యాత్ర సాయంత్రానికి కర్నూలుకు చేరుకుంటుందన్నారు.ఇక్కడ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఉన్న బహిరంగ ప్రదేశంలో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విత్తనశుద్ధిపై అవగాహన పెంచండి

- ఇన్‌పుట్ డీలర్లకు ఆత్మ డీపీడీ శ్రీలత సూచనలు



మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన పెంచాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ మాట్లాడుతూ... వ్యవసాయంలో విత్తనశుద్ధికి ఎంతో ప్రాధాన్యత ఉందని, విత్తనం ద్వారా వ్యాపించే చీడపీడలను సమర్థవంతంగా నివారించుకోవచ్చని చెప్పారు. చాల మంది రైతులు విత్తనశుద్ధి చేసుకోకుండానే విత్తనాలు విత్తుకుంటారని, దీంతో పంటలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. విత్తనాలను శిలీంద్ర నాశినితో శుద్ధిచేసి, విత్తనం వేయుటకు ముందు జీవ శిలీంద్ర నాశినితో విత్తనశుద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని ఇన్‌పుట్ డీలర్లను కోరారు. దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... నిల్వ చేసిన ధాన్యంలో ఆశించు పురుగులు, వాటిని నియంత్రించు పద్ధతులను వివరించారు.ధాన్యం నిల్వ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పురుగుల వల్ల 20-25 శాతం వరకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ప్రతి అవసరానికి ముందు సంప్రదించేది ఇన్‌పుట్ డీలర్లేనని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు.

అలరించిన ‘అమెరికా అల్లుడు’ నాటకం





నాటకంలో ఓ సన్నివేశం, కళాకారుడు మల్లాది భాస్కర్‌ను సన్మానిస్తున్న టీజీవీ కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు కల్చరల్: ‘అమెరికా అల్లుడు’ హాస్య నాటకం ప్రేక్షకులను అలరించింది. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ కళాకారులు మల్లాది భాస్కర్, ఎంఎస్ వాసన్, జి.ఎస్. చలపతి, మల్లాది కుటుంబ శర్మ, కాసాని లక్ష్మీనారాయణ, ఏకే శ్రీదేవి అద్భుత ప్రదర్శన ఇచ్చారు. కళాక్షేత్రం తరఫున కళాకారుడు మల్లాది భాస్కర్‌కు రూ.16 వేలు పారితోషికం అందజేసి సన్మానించారు. అంతకు ముందు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు లక్ష్మీకాంతరావు, ఇనాయతుల్లా, క్రిష్టఫర్, కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, రచయిత పల్లేటికుల శేఖర్, నంది నాటక పోటీల న్యాయ నిర్ణేతలు ఎస్ఆర్ఎస్ ప్రసాద్, జానకిరామ్, గోపి శెట్టి వెంకటేశ్వర్లు తదితర కళాకారులు ఇటీవల మృతి చెందిన సీనియర్ రంగస్థల, టీవీ, సినీ కళాకారులు సుభాన్‌సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఆర్.కొంతలపాడు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 9 నుంచి 11 వరకు అన్నమయ్య జిల్లాలో నిర్వహించనున్న 63 వ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆర్.కొంతలపాడు గ్రామానికి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 8 వ తరగతి చదువుతున్న హెచ్.ఆర్. రామ్‌చరణ్, బాలికల విభాగంలో ఎస్. శివవాణి ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు సావిత్రి, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఓడిస్తాం

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్న ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్, లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా.తేజావత్ బెల్లయ్యానాయక్‌కు టికెట్ కేటాయించకుండా కుట్రలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఎన్నికల్లో ఓడిస్తామని ఎల్‌హెచ్‌పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కైలాస్‌నాయక్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులైన బెల్లయ్యనాయక్‌కు హామీ ఇచ్చిన మహబూబాబాద్ టికెట్‌ను ఇతరులకు కేటాయించి బంజారా నేతకు అన్యాయం చేశారన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కైలాస్‌నాయక్ మాట్లాడుతూ భారత్ జూడో యాత్రలో రాహుల్‌గాంధీతో పాటు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు అలుపెరగకుండా పాదయాత్ర చేసిన బెల్లయ్య నాయక్‌ను విస్మరించడం దారుణమన్నారు. బెల్లయ్యానాయక్‌కు టికెట్ రాకుండా కుట్రలు పన్నిన రేంవత్‌రెడ్డికి బంజారా ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఏపీ నుంచి కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కూడా పర్యటించి అక్కడి బంజారాల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్న బెల్లయ్యనాయక్‌కు ఖచ్చితంగా టికెట్ కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో షెడ్యూల్డు ట్రైబ్స్ ఫెడరేషన్ నాయకులు కాలునాయక్, సేనావత్ రాంనాయక్, ఎస్టీఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయనాయక్, భరత్‌నాయక్, హుసేన్‌నాయక్ పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి మార్గదర్శి భగవద్గీత



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులకు హారతి ఇస్తున్న పురోహితులు



సందేశం ఇస్తున్న ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత మార్గదర్శిగా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందన్నారు. జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నైతిక విలువలు నేర్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రాహుగ్రస్త చంద్రగ్రహణ హోమం



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



హోమంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో సూర్య భగవానుడు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో రాహు గ్రస్త చంద్రగ్రహణ పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహాగణపతి, నక్షత, ఆదిత్యాది నవగ్రహ, మృత్యుంజయ, ఆయుష్య హోమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాలు



సమ్మేళనంలో పాల్గొన్న తెలగ కాపు బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: ఆర్థికంగా వెనుకబడిన బలిజ విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు మహిళలు సాంస్కృతిక, సామాజిక రంగాల్లో రాణించేందుకు తోడ్పాటు అందించనున్నట్లు బలిజ సంఘం పెద్దలు అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు నగర తెలగ కాపు బలిజల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వై.నారాయణరెడ్డి, మాజీ కార్యదర్శి కప్పట్రాళ్ల మోహన్, సభ్యులు ఈశ్వర్, పత్తి ఓబులయ్య, శోభన్ బాబు, గాండ్ల లక్ష్మన్న, కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. డిసెంబర్ 10వ తేదీన విజ్ఞాన పీఠంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం వన భోజన మహోత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం సభ్యులు, రాయల మహిళా సమాఖ్య, కేఆర్ గ్రూప్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



జావెలిన్‌త్రో విసురుతూ పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్) : క్రీడల్లో ప్రతిభ చూపే వారికి టీజీవీ సంస్థలు ప్రోత్సాహం అందిస్తాయని మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక నగర శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు తాను చర్యలు తీసుకున్నానన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ఎంపికయిన మాస్టర్స్ అథ్లెట్లు వచ్చే నెల 8 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలన్నారు. అనంతరం ఆదోని నుంచి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయిన క్రీడాకారులను టీజీ సన్మానించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు పాండురంగారెడ్డి, రవికుమార్, వెంకటేశ్వర్లు, నాషాద్ పాల్గొన్నారు.

వేగంగా.. నమ్మకంగా!

- ఆధునిక కాలానికి అనుగుణంగా తపాలాశాఖ సేవలు
- ప్రైవేటు కొరియర్ల కన్నా వేగంగా బట్వాడా
- విదేశాలకు 72 గంటల్లోనే పార్శిల్



హెడ్ పోస్టాఫీస్

కర్నూలు (న్యూటౌన్): మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, విధివిధానాలు సడలింపు చేసుకుంటూ తపాలాశాఖ సేవలందిస్తోంది. ఇందులో భాగంగానే అత్యాధునిక బహుళ ప్రయోజనాలు కలిగిన సేవలను ప్రవేశపెట్టింది. వీటి ద్వారా దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్నవారికి సైతం నమ్మకంగా.. వేగంగా పార్శిళ్లను చేరవేస్తోంది.

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్..

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్ ద్వారా దేశ విదేశాలలో నివశిస్తున్న ఎన్ఆర్ఐలకు వివిధ రకాల వస్తువులను 72 గంటల్లో పంపే సౌకర్యం తపాలాశాఖ కల్పిస్తోంది.

స్పీడ్ పోస్ట్..

స్పీడు పోస్ట్ సౌకర్యం ప్రపంచీకరణలో భాగంగా విస్తృతమైనది. ప్రైవేట్ కొరియర్ల కన్నా నమ్మకంగా, వేగవంతంగా బట్వాడా జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, బీమా, బ్యాంకింగ్, చిట్‌ఫండ్ కంపెనీలు పూర్తిగా స్పీడ్ పోస్టు పైనే ఆధారపడుతున్నాయంటే దీని విశ్వసనీయతను అంచనావేయొచ్చు.

కోర్ బ్యాంకింగ్ సేవలు..

కోర్ బ్యాంకింగ్ సేవలు 2014లో దేశ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. దీంతో సేవింగ్స్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా ఖాతాదారులకు ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలందిస్తూ మన్ననలు పొందుతోంది.

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ (ఎంఎంటీఎస్)

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా అత్యవసరంగా డబ్బును సులువుగా ఇతరులకు పంపే సౌకర్యం కలదు. డబ్బు పంపాల్సిన వ్యక్తికి మొబైల్ ద్వారా మెసేజ్ వెళ్తుంది. వెంటనే అందుబాటులో ఉన్న తపాలాశాఖ కార్యాలయానికి వెళ్లి డబ్బు పొందవచ్చు.

ఈఎంఓ..

ఎలక్ట్రానిక్ ఈఎంఓ ద్వారా డబ్బులు వేగంగా పంపే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సీఓడీ..

క్యాష్ అండ్ డెలివరీ సీఓడీ అమలులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో సంప్రదించిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఆయా వస్తువులను సీఓడీ ద్వారా పొందవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన..

అప్పుడే పుట్టిన ఆడపిల్ల నుంచి పదేళ్లలోపు బాలికల తరఫున వారి తల్లి, తండ్రి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు పొందవచ్చు. సంవత్సరంలో రూ.1000 నుంచి రూ.1లక్ష వరకు పొదుపు డిపాజిట్ చేసుకోవచ్చు.

టీటీడీ దర్శన టికెట్లు..

గతంలో తిరుపతికి వెళ్లే భక్తులకు జిల్లా కేంద్రంలోనే దర్శన టికెట్లు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అలా కాకుండా రూ.300 చెల్లించి దర్శన టిక్కెట్లు ఇక్కడి నుంచే పొందే అవకాశం తపాలాశాఖ కల్పిస్తోంది.

మరిన్ని సేవలు

పై సేవలే కాకుండా మైస్టాంప్.. మైఫొటో అనే వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజల ఫొటోలతో తపాలాశాఖ బిల్లను ముద్రించుకునే అవకాశం, ఎల్ఈడీ సౌకర్యం ద్వారా వివిధ వ్యాపార ప్రకటనలను చూసుకునే అవకాశం మీడియా పోస్ట్ ద్వారా లభించింది. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన, పాస్‌పోర్టు సేవలు, పోస్టల్ బ్యాంకు సేవలు, ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు స్టాంపుల సేకరణలో ఆసక్తి ఉన్న వారికి అనుకూలంగా అందమైన బొమ్మలతో రంగు రంగుల పోస్టల్ స్టాంప్‌లు ముద్రించి విక్రయిస్తారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



తపాలాశాఖ అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ పథకాలను వారి సంక్షేమం కోసం వినియోగించుకోవాలి. ఈ పథకాలు ఎంతో మేలు చేస్తాయి.

– నూర్ అహ్మద్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, హెడ్‌పోస్టాఫీస్, కర్నూలు